టపాసుల కొనుగోళ్ల జోరు


కడప నగరంలోని మైదానంలో టపాసుల దుకాణాల వద్ద సందడి

కడప సెవెన్‌రోడ్స్: నింగిలోని చుక్కలు నేలకు దిగినట్లు తళుకుమంటున్న దీపకాంతులు.. నక్షత్రాలు విసిరేసినట్లు కాంతులు.. దీపావళి పండగ సందర్భంగా కనిపించే దృశ్యాలివీ! ప్రతి ఇంటి ఎదుట దీపాల తోరణాలు కనిపిస్తాయి. వీధుల్లో బాణసంచా సందడి కనిపిస్తుంది. సోమవారం దీపావళి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

దుకాణాల్లో సందడి

కడప నగరం మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు ఆదివారం ఉదయం నుంచి సందడిగా మారాయి. ప్రజలు కుటుంబాలతో కలిసి వచ్చి టపాసులు కొనుగోలు చేయడం కనిపించింది. శనివారం నగరంలో వర్షం కురిసినా ఆదివారం వర్షం లేకపోవడం దుకాణదారులకు ఉపశమనం కల్పించింది. దుకాణాలు కొనుగోలుదారులతో ముఖ్యంగా పిల్లలతో కళకళలాడాయి. పండగ సందర్భంగా వివిధ వస్తు సామాగ్రి, దుస్తుల కొనుగోలు కారణంగా నగరంలోని వైవీ స్ట్రీట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపించాయి. కరకరలాడే కాకర పూవ్వొత్తులు, చిరచిరలాడే చిచ్చుబడ్లు, రివ్వున ఎగిరే తారాజువ్వలు, చెవులు దిమ్మెక్కించే లక్ష్మీ పటాసులు, బుసలు కొడుతూ పొంగే పాము బిళ్లలు, వెలుగులు చిమ్మే వెన్నముద్దలు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు కొనేందుకు జనం ఎగబడ్డారు. జిల్లా వాసులు ఉదయాన్నే తల స్నానాలు చేసి లక్ష్మీమాతకు విశేష పూజలు చేస్తారు. రాత్రి తమ స్థాయిని బట్టి టపాసులు కాల్చడం ఈ పండుగ ప్రత్యేకతగా చెబుతారు.

మార్వాడీల సందడి

కడప నగరంలో 500కు పైగా రాజస్థాన్, గుజరాతీ మార్వాడీల కుటుంబాలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రంలోగా సమీపంలోని పెద్ద వాళ్లను కలిసి పాదాభివందనం చేసి వారికి స్వీట్లు అందజేసి ఆశీస్సులు పొందుతారు. ఇతర ప్రాంతాలలో ఉన్న వారికి ఫోన్లు లేదా వీడియో కాల్ చేసి శుభాకాంక్షలు తెలుపుతారు. దీపావళి రోజు నుంచి అకౌంటు పుస్తకాలలో లెక్కలు రాయడం మొదలు పెడతారు. ఎర్రటి రంగుపై పసుపు చుక్కలుగల వస్త్రాన్ని తలపాగా (పేటా)గా చుట్టుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. పలువురు వ్యక్తులు పేటాను తమ కంటే పెద్దవారికి దీపావళి బహుమతిగా అలంకరించి ఆశీస్సులు పొందారు.

దుకాణాల వద్ద పోలీసుల సూచనలు

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బంది టపాసుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం దుకాణదారులతోపాటు కొనుగోలు దారులకు సూచనలు, ప్రతి ఒక్కరూభద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా సంతోషదాయకంగా పండుగను నిర్వహించుకోవాలన్నారు. చిన్న పిల్లలుకలిగిన వారు మరింత జాగరూకతతో వ్యవహరించాలని తెలియజేశారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు బూటకమేనా?



మాట్లాడుతున్న పోచంరెడ్డి సుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు బూటకమేనా అంటూ మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. కడప ప్రగతిశీల రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్ ప్రకటిస్తామని, మెరుగైన పీఆర్సీ అమలుచేస్తామని హామీ ఇచ్చి.. అధికారం వచ్చాక మరిచిపోయారన్నారు. పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ 28 నెలల కాలంగా పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అన్నారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని పీఆర్సీ ప్రకటిస్తామని చంద్రబాబు చెప్పడం చూస్తే ఉపాధ్యాయులు నష్టపోయినట్లే అన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.చిన్నరెడ్డన్న మాట్లాడుతూ పెన్షనర్లకు 15 నెలలుగా గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ ఎన్‌కాష్‌మెంట్ చెల్లించకపోవడంతో ఆర్థికబాధలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. డబ్బులు లేక కొందరు అనారోగ్యంతో చనిపోతున్నారని, మరింతమంది తమ పిల్లల పెళ్లిళ్లు చేయలేకపోతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు పీవీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ విధానంపై పునః సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన నాయకులు ఇపుడు ఆ విషయం మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు.

శాంతి సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం


ప్రసాద్‌రాజును సత్కరిస్తున్న మానవత సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్: శాంతి సమాజ నిర్మాణమే మానవత సంస్థ ధ్యేయమని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ప్రసాద్‌రాజు అన్నారు. సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్‌రాజు మాట్లాడుతూ విలువలు కలిగిన వ్యక్తుల కలయిక మానవత సంస్థ అన్నారు. మానవత కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి మాట్లాడుతూ సమ సమాజ స్థాపనే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తోందన్నారు. అనంతరం ప్రసాద్‌రాజును ఘనంగా సత్కరించారు. పుట్టా సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, సుబ్బయ్య, మాధవి, గౌరి, రెడ్డెన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న నృత్యం


నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప సెవెన్‌రోడ్స్: నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సాంస్కృతిక కళావేదిక పైన మిస్సా సహకారంతో నగరానికి చెందిన అఖిల్ మాస్టర్ బృందం జానపదాలు, శాస్త్రీయ, సినీ నృత్యాలతో అలరించింది. శిల్పారామం ప్రతినిధులు పర్యవేక్షించారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీయే కూటమి ప్రభుత్వం బీసీలను విస్మరిస్తోందని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున అన్నారు. నగరంలోని కలెక్టరేట్ వద్ద గల తమ కార్యాలయంలో కార్యకర్తల నుద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే బీసీలకు న్యాయం చేస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో బీసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లయ్య, జయరాం, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

ఎస్‌ఈసీ సభ్యులకు సన్మానం


మాసీమ బాబు,యానాదయ్య సుహైల్ అహ్మద్‌లను సత్కరిస్తున్న పార్టీ నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన మాసీమబాబు, ఎస్.జయానాదయ్య, డాక్టర్ సుహేల్ అహ్మద్‌లను ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక మద్రాస్ రోడ్డు లోని వైఎస్సార్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్ బేగం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

- స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో జిల్లా బేడ, బుడగ జంగం పోరాట సమితి నాయకుడు పస్తం అంజి, తదితరులు ఎస్‌ఈసీ సభ్యులకు శాలువా కప్పి సన్మానించారు.

గంగమ్మతల్లికి పూజలు


విశేష అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లిని విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, ముడుపులు కట్టి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్యనాథేశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలి

చింతకొమ్మదిన్నె: భారతదేశ ఉత్పత్తులనే వినియోగించాలని బీజేపీ కమలాపురం నియోజకవర్గ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి కోరారు. స్వదేశీ వస్తువులు వినియోగించాలని కోరుతూ బయనపల్లిలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఇలా చేస్తే భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: నూతన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరాంజులరెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్–1938 జిల్లా అధ్యక్షుడు బత్తల రాజు ఆధ్వర్యంలో డీఎస్సీ ఉత్తీర్ణులై బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఆదివారం కడప ఎన్‌జీవో కార్యాలయంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, విద్యాప్రగతి కోసం కొత్త ఉపాధ్యాయులు సంఘంలో సభ్యత్వం తీసుకొని ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, బాబు, నాగభూషణం, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, దస్తగిరి, పోతులూరయ్య, కమాల్ బాషా, శివరామకృష్ణా రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని పోచంరెడ్డిపల్లె గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ట ముగింపు కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, యరమలపల్లె సర్పంచు సౌజన్యకుమార్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శివాంజనేయరెడ్డి, పలువురు నాయకులు ఆయన వెంట ఉన్నారు.

కూటమి ప్రభుత్వం గద్దె దిగాలి

రైతు వ్యతిరేక కూటమి ప్రభుత్వాన్ని గద్దె దిగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వీరపునాయునిపల్లెలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పించడమేగాక, నష్ట పరిహారం అందించి.. సకాలంలో రాయితీపై విత్తనం, ఎరువులు అందించడంలో ముందుండేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకపోగా రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతుల తరపున ఉద్యమాలు చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

రచయితకు సాహిత్య కళానిధి పురస్కారం


అవార్డు అందుకుంటున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి సాహిత్య కళానిధి అవార్డు అందుకోవడం అభినందనీయమని రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్ సత్యాగ్ని అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాహిత్య రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా మూలమల్లికార్జునరెడ్డి ఆ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పురస్కారాన్ని అందకోవడం సంతోషంగా ఉందని, సాహిత్య కళా రంగాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ రచయితలు రాచెపాలెం చంద్రశేఖరరెడ్డి, పిచ్చయ్య చౌదరి, సి.వెంకటరామిరెడ్డి, ఎం.సంజీవమ్మ, షేక్‌సత్తార్‌ఫైజి, జి.హనుమంతరావు, సి. శివారెడ్డి, జె.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి. గోపాలకృష్ణశాస్త్రి తదితరులు మూల మల్లికార్జునరెడ్డిని అభినందించారు.

ఊళ్లకు వెళ్లే వారంతా అప్రమత్తంగా ఉండాలి


ఏ.వెంకటేశ్వర్లు

కడప అర్బన్: దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలని, ప్రమాదాలకు దూరంగా వుండేలా చూసుకోవాలని ఆయన తెలిపారు. దీపావళి పండగకు తమ ఇళ్లను వదిలిడితర ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రధానంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాయితీపై బుడ్డ శనగ విత్తనం ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్: రైతులకు రాయితీపై బుడ్డ శనగ విత్తనాలు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ బుడ్డశనగ విత్తనం ఇస్తామని ఏడు రోజులుగా అధికారులు చెబుతున్నారేగానీ ఇవ్వడం లేదన్నారు. డీఏపీ ఎరువులు మార్కెట్‌లో అందుబాటులో లేవన్నారు. వర్షాలు సకాలంలో పడడంతో ఉల్లి దిగుబడి బాగా వచ్చిందని, మద్దతు ధర లేక పొలాల్లోనే రైతులు పంట వదిలేస్తున్న పరిస్థితి ఉందన్నారు. క్వింటా రూ.1200తో ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనలేదన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించారని, దానిని కడప జిల్లాకు వర్తింపజేయాలని కోరారు. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పది రోజుల క్రితం కలెక్టర్‌కు విన్నవించినా దానిపై ఇంతవరకూ స్పష్టత ఇవ్వలేదన్నారు. పంటల బీమా వచ్చిందని చెప్పినా రైతుల ఖాతాల్లోనూ నగదు జమ కాలేదని అన్నారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగివేమన విశ్వ విద్యాలయం తెలుగు డిపార్టుమెంట్ ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు నగరంలోని రైల్వే కాలనీ, మేరీ నగర్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ మానవ శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు, విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రోజన్, కొవ్వు ఉండే పదార్థాలను సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు మాట్లాడుతూ, పిల్లలు, పెద్దలు తగినంత నీరు, సరైన వ్యాయామం చేయడం, సమయానికి నిద్ర పోవడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు

సారూ.. చెత్త శుద్ధి ఇదేనా...

చెత్త సేకరణ చేస్తున్నాం.. నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్నాం అంటూ మాటలు వల్లెవేసే అధికారులు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోయినా.. వాహనదారులకు ఇబ్బంది కలిగించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలోని ఈ దృశ్యాలను చూస్తే చెత్త నిర్వహణలో వారి నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ ప్రజలు అసహనం ప్రదర్శిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప





అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పరిపాలన విభాగం ఏఎస్పీ కె.ప్రకాష్‌బాబు


సమావేశంలో పోలీసు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏఎస్పీ కె.ప్రకాష్‌బాబు

కడప అర్బన్: విధి నిర్వహణ సమయంలో అసాంఘిక శక్తుల చేతిలో మృతి చెందిన పోలీసు అమర వీరుల కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), కుటుంబ స్థితిగతులు, బాగోగుల గురించి ఏఎస్పీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మృతిచెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని, సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి నేరుగా వచ్చి సమస్యను తనకు విన్నవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, డీపీఓ ఏఓ వెంకటరమణ, సూపరింటెండెంట్ సురేష్, శివరాముడు, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖర్‌నాయక్, వెంకటేశ్వర్లు, దూలం సురేష్, ఉప్పు శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.